సాక్షి కామారెడ్డి

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



సౌకర్యాలు కరువు

పల్లె దవాఖానాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో రోగులతోపాటు వైద్యులూ ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 / 13.0

ఉదయం చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా పంచాయతీ అధికారి బదిలీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్‌రావు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెయిటింగ్ లో ఉన్న కె.మురళికి పోస్టింగ్ ఇచ్చారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత ఆయన రిలీవ్ కావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షకు 128 మంది విద్యార్థులకుగాను 127 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 94 మందికి గాను 87 మంది ప్రాక్టికల్స్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 43 విద్యార్థులకు గాను అందరూ హాజరుకాగా వొకేషనల్ విభాగంలో 159 కి గాను 141 హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



లింగంపేట: శెట్పల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ బృందం సందర్శించింది. పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించింది. బృంద సభ్యులు ఎఫ్‌ఏ-1 నుంచి ఎఫ్‌ఏ-4 వరకు సాధించిన మార్కులు, ప్రాజెక్టు వర్క్ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధ, పరిశీలన బృందం సభ్యులు వేణుగోపాల్, సాయిలు, నారాయణ, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతో పాటు గ్రామ పంచాయతీల నిర్వహణకు అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరుతూ వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు సోమవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. అప్పులు చేసి పారిశుధ్య పనులు చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుతోపాటు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, సంతోష్, నరేందర్, రమేష్, అజీమోద్దీన్, పవిత్ర, రజిత తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఖాళీగా ఉన్న మడిగెలు

జిల్లాకేంద్రంలో వ్యాపార రంగం కుదేలవుతోంది. పెరిగిన పోటీతో దందాలు సాగక, కిరాయిల భారం మోయలేక పలువురు దుకాణాలను ఎత్తేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా మడిగెలకు టులెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

వ్యాపారం డీలా!

వ్యాపారాల్లో పెరిగిన పోటీ

- ఆన్‌లైన్ షాపింగ్‌కు మొగ్గు చూపుతున్న జనం
- ఆకాశాన్నంటిన షట్టర్ల అద్దెలు
- దందాకు దూరమవుతున్న వ్యాపారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నాలుగైదు జిల్లాలకు కూడలిగా అన్ని వ్యాపారాలకు అడ్డాగా ఉన్న కామారెడ్డి పట్టణం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మూడు, నాలుగు దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగిన కామారెడ్డి మార్కెట్.. ప్రాభవాన్ని కోల్పోతోంది. బెల్లంపై ఆంక్షలతో గంజ్ ఉనికి కోల్పోయింది. దివాలా సంఘటనలతో ఫైనాన్స్ వ్యాపారం కుప్పకూలిపోయింది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలలో స్తబ్దత ఏర్పడింది. దీనికి తోడు వివిధ వ్యాపారాల్లో పెరిగిన ప్రత్యక్ష పోటీ ఒకవైపు, ఆన్‌లైన్ వ్యాపారం మరోవైపు దందాలను దెబ్బతీస్తున్నాయి. ఇదే సమయంలో మడిగెల అద్దెలు అడ్డగోలుగా పెరిగాయి. కిరాయిలు భారంగా మారడంతో పలువురు వ్యాపారానికి స్వస్తి పలుకుతున్నారు. దీంతో ఏ దుకాణం ఎప్పుడు ఖాళీ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఎక్కడ చూసినా టులెట్ బోర్డులే..

కామారెడ్డిలో గతంలో ఎవరైనా కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాలంటే అడ్డా దొరికేది కాదు. ఎవరైనా కొత్తగా భవనాన్ని నిర్మిస్తే అడ్వాన్సులు ఇచ్చి మరీ బుక్ చేసుకునేవారు. ఎవరైనా మడిగె ఖాళీ చేస్తున్నారంటే... దానికోసం పోటీ ఉండేది. ఇప్పుడు పరిస్థితులు తలకిందులయ్యాయి. చాలా బిల్డింగులు, మడిగెలకు టులెట్ బోర్డులు కనిపిస్తున్నాయి. వ్యాపారాలు నడవక, కిరాయిలు భారంగా మారడంతో దుకాణాలను ఎత్తేస్తుండడంతో జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎక్కడ చూసినా టులెట్ బోర్డులు కనిపిస్తున్నాయి. కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ఇరవైకి పైగా మడిగెలు ఖాళీగా ఉన్నాయి.

అడ్డగోలుగా పెరిగిన కిరాయిలు..

జిల్లా కేంద్రంలో దుకాణాలకు సంబంధించిన కిరాయిలు అడ్డగోలుగా పెరిగాయి. దుకాణాలు, మడిగెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు కిరాయి వసూలు చేస్తున్నారు. పెద్దవి అయితే రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు కిరాయిలు నడుస్తున్నాయి. ఆ కిరాయిలు భరించలేక, దందాలు నడవక చాలా మంది దుకాణాలు మూసుకుంటున్నారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రోడ్డు వెంట దశాబ్దాలపాటు కొనసాగిన పలు హేర్ కటింగ్ సెలూన్లను గల్లీల్లోకి మార్చుకున్నారు. కిరాయిలపై నియంత్రణ లేకపోవడంతో ఏం చేయలేకపోతున్నామని ఓ వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని అడిగినంత కిరాయి ఇవ్వకుంటే ఖాళీ చేయమంటున్నారని పేర్కొన్నారు. అద్దెల నియంత్రణపై సర్కారు దృష్టి సారించాలని వ్యాపారులు కోరుతున్నారు.

అన్ని వ్యాపారాలదీ అదే దారి..

కామారెడ్డి మార్కెట్ అంటే బెల్లం, వస్త్రాలు, బంగారం, కిరాణం, మెడికల్, ఆయిల్, బీడీ తదితర వ్యాపారాలకు పెట్టింది పేరు. స్థానిక గాంధీ గంజ్ నుంచి బెల్లం వివిధ రాష్ట్రాలకు తరలివెళ్లేది. బెల్లంపై ఆంక్షల పుణ్యమా అని గంజ్ ప్రాభవాన్ని కోల్పోయింది. గతంలో జిల్లాకేంద్రంలో చిన్నాచితక కలిపి రెండు వందల పైచిలుకు వస్త్ర దుకాణాలు, రెడీమేడ్ షాప్‌లు ఉండేవి. ఆయా దుకాణాలను భారీ షాపింగ్ మాల్స్ దెబ్బతీశాయి. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లలోనే రద్దీ కనబడుతోంది. అయితే ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ షాపింగ్‌తోపాటు హైదరాబాద్‌కు వెళ్లి షాపింగ్ చేసే సంస్కృతి పెరిగిపోయింది. చిన్నచిన్న దుకాణాలతోపాటు మాల్స్‌పైనా దీని ప్రభావం కనిపిస్తోంది. వ్యాపారం నడవక ఇటీవల కొత్తబస్టాండ్ సమీపంలో ఓ ప్రముఖ కంపెనీతోపాటు నిజాంసాగర్ రోడ్డులో మరో కంపెనీ ఔట్‌లెట్‌ను కూడా ఎత్తేశారు.

ఆఫర్లతో బేజారు..

కిరాణా వ్యాపారం జిల్లా కేంద్రంలో జోరుగా నడుస్తుంది. అయితే వ్యాపారంలో పోటీ పెరగడం, సూపర్‌మార్కెట్లు ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటిస్తుండడంతో చిన్నచిన్న కిరాణా దుకాణాలు దెబ్బతింటున్నాయి. మెడికల్ బిజినెస్‌లో రాష్ట్రంలోనే కామారెడ్డిది ప్రత్యేక స్థానం. హోల్‌సేల్ వ్యాపారం కూడా ఎక్కువగా నడిచేది. ఇక్కడి ఏజెన్సీల నుంచి రెండు మూడు రాష్ట్రాలకు మందులు సరఫరా అవుతుంటాయి. అయితే హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీలు పెరిగిపోయి పోటీ ఎక్కువైంది. ఇదే సమయంలో కార్పొరేట్ సంస్థల మెడికల్ షాప్‌లు రావడంతో స్థానిక ఏజెన్సీల పరిస్థితి మారిపోయింది. మరోవైపు ఆస్పత్రులే సొంతంగా మెడికల్ షాప్‌లు ఏర్పాటు చేసుకుంటుండడంతో బయటి మెడికల్ షాపులకు గిరాకీ తగ్గిపోతోంది. చికెన్ సెంటర్లు కూడా గల్లీగల్లీలో వెలిశాయి. వాటి మధ్య పోటీ ఏర్పడడంతో కిలోపై రూ.30 వరకు డిస్కౌంట్ ఇస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు టీ స్టాల్స్ ఏర్పాటు చేస్తుండడంతో లోకల్ చాయ్ వాలాల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా మారింది.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- సాక్షి కథనంపై ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమీక్ష



జీజీహెచ్‌లో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో 3,580 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారికి మరో సారి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్ల జోళ్లు అందిస్తామన్నారు. అనంతరం ఆయన ఆస్పత్రిలోని రికార్డులు, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు సకాలంలో హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని సూచించారు. అనంతరం పురుషుల వార్డు, డయాలసిస్, ఐసీయూ, కంటి శస్త్ర చికిత్సల గదులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. రోజువారీ చెత్తను మున్సిపల్ వాహనంలో తరలించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగంకు సూచించారు. ఆస్పత్రిలో నీటి సంపును పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకట్, డాక్టర్లు రాంసింగ్, యాదయ్య, మారుతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమరణాలపై ఆగ్రహం!

జీజీహెచ్‌లో గైనకాలజిస్టుల కొరత, శిశు మరణాలపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. సోమవారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదాతో కలెక్టర్ కార్యాలయంలో చర్చించారు. వైద్య సేవలు, గర్భిణుల రిఫర్‌లు, శిశు మరణాలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మధ్యాహ్నం జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ చాంబర్‌లో గైనిక్ సమస్యలపై ప్రత్యేకంగా సమీక్షించారు. గైనిక్ హెచ్‌వోడీ విజయకృష్ణతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రసవాలు, సిజేరియన్‌లు, శిశువుల మృతి కేసులపై ఆరా తీశా గర్భిణులకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని ఆదేశించారు. అవసరమైతే అత్యవసరంగా కాంట్రాక్ట్ విధానంలో గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేసుకోవాలని సూచించారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు

కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి

కామారెడ్డి క్రైం : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలను అమలు చేయకుండా అన్ని రకాలుగా ప్రజలను మోసం చేస్తోందన్నారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుంబాల రవి యాదవ్, గెరిగంటి లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్‌గౌడ్, బల్వంత్‌రావు, పిప్పిరి ఆంజనేయులు, మాసుల లక్ష్మీనారాయణ, భానుప్రసాద్, లద్దూరి కృష్ణాయాదవ్, జోగుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులను చట్టసభకు పంపొద్దు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

- టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్

కామారెడ్డి టౌన్ : పెట్టుబడిదారులను చట్టసభలకు పంపించవద్దని ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యారంగం సంక్షోభంలో ఉందన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై చట్టసభలో గళమెత్తుతానన్నారు. ప్రజలందరికీ ఒకే రకమైన నాణ్యమైన విద్య కోసం పోరాటం చేస్తానన్నారు. ఓపీఎస్ అమలు, 317 జీవో బాధిత ఉపాధ్యాయులు, కేజీబీవీలలో వెట్టిచాకిరికి గురవుతున్న ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్, కొంగల వెంకటి, యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు, లింగం, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆయా యూనియన్ల ప్రతినిధులు విఠల్, నళినీదేవి, శ్రీనివాస్, వాసు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ఎస్సెస్సీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థిని ప్రశ్నించి సమాధానం రాబడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రాజంపేట: ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వార్షిక పరీక్షలలో వందశాతం ఉత్తీర్ణులయ్యేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఎస్సెస్సీ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో పాఠాలు వినాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పింది అర్థంకాకపోతే మరోసారి అడిగి తెలుసుకోవాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో తెలుసుకొని సంబంధిత టీచర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య తెలిపారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులను అందించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో పూర్ణచందర్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకేదీ రక్షణ!

బడిలోనూ తప్పని వేధింపులు

- పోక్సో కేసులు నమోదవుతున్నా మారని ఉపాధ్యాయులు
- తాజాగా గాంధారి మండలంలో కేసు నమోదు
- ఆందోళన కలిగిస్తున్న సంఘటనలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇంటాబయటా ఆడపిల్లలపై వేధింపులు ఆగడం లేదు. నిత్యం ఎక్కడో ఒకచోట టీజింగ్ ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో బడికి వెళ్లిన బాలికలకు అక్కడా వేధింపులు తప్పడం లేదు. కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన టీచర్లే కీచకులుగా మారి అసభ్యకరంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయలో విద్యార్థినులతో అసభ్యకరంగా వ్యవహరించిన నలుగురు టీచర్లను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరిచిపోకముందే తాజాగా సోమవారం గాంధారి మండలంలో ఓ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్‌పై పోక్సో కేసు నమోదైంది. జిల్లాలో రెండేళ్ల కాలంలో స్కూళ్లలో జరిగిన సంఘటనలకు సంబంధించి 15 పోక్సో కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. బాధ్యత కలిగిన టీచర్లే కీచకులుగా మారితే విద్యార్థినుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి సంఘటనలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలకు భద్రత లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒకరిద్దరు చేస్తున్న తప్పుడు పనులతో పవిత్రమైన వృత్తికి కళంకం వస్తోందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. టీచర్లపై పోక్సో కేసులు నమోదైన వార్త తెలిసి చాలా మంది ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతున్నారు. కొందరి వికృత చేష్టల వల్ల తమ గౌరవం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినా..

స్కూళ్లలో జరుగుతున్న సంఘటనలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు ఎస్పీ సింధుశర్మ సీరియస్‌గా పరిగణిస్తున్నారు. బాలికలకు రక్షణ కల్పించడం కోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కామారెడ్డి జిల్లాలో స్కూళ్లలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లను నియమించారు. వారికి శిక్షణ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఆ సమయంలో మరో సంఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది.

బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తమ అభ్యర్థిని నిలపకుండా బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని సోమవారం నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జూపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో 56వేల ఉద్యోగాలు ఇచ్చిందని, జాబ్ క్యాలెండర్‌నూ ప్రకటించామని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ దుర్భర పరిస్థితుల్లో ఉన్నా రుణమాఫీ, బోనస్, రైతు భరోసా ఇతర పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బీజేపీ మతం పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబం గురించి బీజేపీ మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కులగణనను విమర్శించే నైతిక హక్కు బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు లేదన్నారు. బీఆర్‌ఎస్ సర్వే కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీలు 5 శాతం పెరిగారన్నారు. సర్వేకు పార్లమెంట్‌లో ఆమోదం తెలపకపోతే రాజకీయంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, పక్కన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు

తెలంగాణకు తీరని అన్యాయం..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని జూపల్లి కృష్ణారావు విమర్శించారు. తెలంగాణ నుంచి అత్యధిక ఆదాయాన్ని కేంద్రానికి అందిస్తున్నా బడ్జెట్‌లో రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, బయ్యారం గనులకు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రులను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్ గురించి కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడితే నవ్వుకుంటున్నారని, మిగులు బడ్జెట్ ఇచ్చారనడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఏనుగు రవీందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, అన్వేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిలు మురళీనాయక్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, నేతలు కైలాస్ శ్రీనివాస్, నగేశ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలను అధికారులకు తెలియజేయాలి



కామారెడ్డి అర్బన్: రైతులు విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం తిమ్మక్‌పల్లిలో విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు బదులిచ్చారు. సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. డివిజనల్ ఇంజినీర్ కల్యాణ చక్రవర్తి, అసిస్టెంట్ డీఈ కిరణ్‌చైతన్య, ఏఈ శ్రీనివాస్, భారతీయ కిసాన్ సంఘ్ నేత సాయి రెడ్డి, గొర్రె బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సామిల్ యాజమానుల సంక్షేమ సంఘు కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: సామిల్ అండ్ టింబర్ (కట్టె కోత మిషన్లు) డిపో యాజమానుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన పోతరాజు వెంకటేష్ పెరిక రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బెజ్జంకి రజనీ కాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ వాజీద్, కోశాధికారిగా తమీమ్ అహ్మద్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు అజంఖాన్, మోహన్‌రెడ్డి, శ్రీధర్ వ్యవహరించారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 58 వినతులు



దివ్యాంగుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 58 ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతు భరోసా, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి..

జిల్లా, మండల స్థాయి అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ సంగ్వాన్ సూచించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పనులను పర్యవేక్షించాలన్నారు. అధికారులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్, ధరణి ఫిర్యాదులపై తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్తి పన్నుల వసూళ్లు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం లాంటి పనులను ఎంపీడీవోలు నిరంతరంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని కుటుంబాల వివరాలు ఈ నెల 28 వరకు ఎంట్రీ చేసుకునేలా ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని తెలిపారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోగా ఫోన్ చేసి కుటుంబ వివరాలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జీవావరణ వ్యవస్థను కాపాడుకోవాలి



వన్యమృగాల కదలికలను తెలుసుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపుతున్న రిసోర్స్‌పర్సన్

కామారెడ్డి అర్బన్: వన్యప్రాణులతో జీవావరణ వ్యవస్థను కాపాడుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్ కుమార్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల ద్వారా అడవుల్లో వన్యప్రాణుల కదలికలు, ఉనికి గుర్తించి వాటిని లెక్కించే విధానం, సాంకేతిక పద్ధతులపై సోమవారం కళాశాల వృక్ష, అటవీ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు రీజినల్ కో–ఆర్డినేటర్ బాపురెడ్డి, ఏవో అఖిల్‌గౌడ్‌లు రిసోర్స్ పర్సన్‌గా వివిధ అంశాలపై విద్యార్థులకు వివరించారు. పులులు, పక్షులు, పాములు, ఇతర వన్యప్రాణుల కదలికలతో పాటు వాటి సంఖ్యను సాంకేతికంగా ఎలా లెక్కించవచ్చో ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రజ్ఞోత్సవ పోటీలు



బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట కాంప్లెక్స్ స్కూల్‌లో సోమవారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రజ్ఞోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పడం, చదవడం, రాయడం, పద్యాలు చెప్పడం, చతుర్విధ ప్రక్రియలపై విద్యార్థులకు పోటీలు పెట్టారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కాంప్లెక్స్ స్కూల్ సెక్రెటరీ మాణిక్యమ్మ, రిసోర్స్ పర్సన్ కిష్టయ్య, సీఆర్పీ రాజయ్య పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

- జేఎన్‌యూ ప్రొఫెసర్ రాజు చౌహాన్



సౌత్‌క్యాంపస్‌లో జేఎన్‌యూ ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు: విద్యార్థులు మారుతున్న కాలానికనుగుణంగా నూతన పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని జేఎన్‌యూ ప్రొఫెసర్ రాజు చౌహాన్ అన్నారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'స్పెక్ట్రోస్కోపి- దాని అనువర్తనాలు' అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశోధన విద్యార్థులకు స్పెక్ట్రోస్కోపి అంశంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో పరిశోధన రంగంలో వేలాది ఉద్యోగాలు ఉంటాయని, విద్యార్థులు ఆ వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు సునీత, నిరంజన్‌శర్మ, శ్రీకాంత్, రసాయనశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



లింగంపేట(ఎల్లారెడ్డి): వ్యవసాయ బోరుబావుల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని శెట్పల్లిసంగారెడ్డి ఏఈ హరీష్‌రావు సూచించారు. సోమవారం బోనాల గ్రామంలో విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలు, విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ క్షేత్రాల్లో వంగిన స్తంభాలను సరిచేశారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, లైన్‌మెన్లు అంబ్రియా, గంగాధర్, ఏఎల్ఎం రవీందర్, రాజు, జహీర్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



మహమ్మద్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



ఎల్లారెడ్డి: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో బర్త్‌డే కేకులు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. స్వీట్లు పంచుకున్నారు. పలు చోట్ల రక్తదానాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు పలు చోట్ల మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో కేసీఆర్ పోరాటం మరువలేనిదని కొనియాడారు.

– ఎల్లారెడ్డి/నిజాంసాగర్

చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

బోధన్‌టౌన్(బోధన్): చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన బచ్చుసింగ్ బాగ్రియా కుటుంబంతో కలిసి బతుకు దెరువు కోసం 15 రోజుల క్రితం బోధన్‌కు వచ్చాడు. స్థానికంగా బొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల బాగ్రియా తన వద్ద ఉన్న రూ. 40వేల నగదును సమీప బ్యాంక్‌లో డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. బ్యాంక్ బంద్ ఉండటంతో అతడు తిరిగి తన ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో సాత్‌పూల్ కల్లుబట్టి వద్ద ముగ్గురు వ్యక్తులు కలిసి, కల్లుబట్టిలోకి తీసుకువెళ్లారు. కల్లు తాగిన అనంతరం బాగ్రియాను సదరు వ్యక్తులు బెదిరించి రూ. 40వేల నగదును తీసుకొని పారిపోయారు. మరుసటి రోజు బాగ్రియా పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా కొత్త బస్టాండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్ మహ్మద్, వసీం, సయ్యద్ సజ్జన్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా బాగ్రియా వద్ద తామే డబ్బులు తీసుకున్నామని అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10,500 నగదును స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ వెల్లడించారు.

పొక్లెయిన్, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో కప్పలవాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు. పొక్లెయిన్, ట్రాక్టర్లు తాళ్లపల్లి వెంకగౌడ్‌కు చెందినవని ఆయన తెలిపారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. తదుపరి విచారణ కోసం వాహనాలను మైనింగ్ శాఖకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మోపాల్ మండలంలో..



మోపాల్: మండలంలోని కాస్‌బాగ్‌తండాకు చెందిన హరిసింగ్ అనుమతులు లేకుండా ఆదివారం అర్ధరాత్రి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోతంగల్ మండలంలో..

రుద్రూర్: పోతంగల్ మండలం కారేగాం శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ సోమవారం తెలిపారు. ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్(బోధన్): వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్షను బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ విధించినట్లు పట్టణ సీఐ నారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల పట్టణానికి చెందిన షేక్ జలాల్ మద్యం తాగి వాహనం నడుపగా పోలీసులకు పట్టుబడ్డాడు. అలాగే మరోవ్యక్తి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా అతడిని పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని బోధన్ కోర్టులోని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం శివారులోని చెరువులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ కేసు నమోదు చేసుకుని శవాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 30–35ఏళ్లు ఉంటుందని, బూడిద కలర్ చొక్కా, గోధుమ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే ముప్కాల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

సగం కాలినస్థితిలో ఒకరి మృతదేహం..

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులోగల అటవీప్రాంతంలో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం సగం కాలిన స్థితిలో లభ్యమైంది. మృతుడు జిల్లాకేంద్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని బీడీ కాలనీకి చెందిన సందీప్(28) ఈనెల 15న అదృశ్యమయ్యాడు. 5వ టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందల్వాయి పోలీసులకు సగం కాలిన స్థితిలో ఉన్న మృతదేహం లభించగా, దుస్తులు, ఇతర ఆనవాళ్ల ఆధారంగా సందీప్‌గా 5వ టౌన్ పోలీసులు గుర్తించారు. కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్న అతడిని అతని స్నేహితులే శనివారం ఆటోలో తీసుకెళ్లినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్ తెలిపారు. త్వరలో వివరాలు వెల్లడిస్తామని ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.


భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల ఓ బైక్ చోరీకి గురైందని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండి సిద్ధగిరి ఈనెల 14న తన ఇంటి ముందర బైక్ పెట్టి, ఇంట్లోకి వెళ్లాడు. గంటన్నర తర్వాత బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ విషయమై బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఎదుట నిలిపిన ఓ బైక్ చోరీకి గురైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. నగరానికి చెందిన రాజ్‌కుమార్ అనే వ్యక్తి జనవరి 31న తన బైకును రైల్వేస్టేషన్ ముందు పార్క్ చేసి హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి ఈనెల 2న అతడు వచ్చేసరికి రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసిన బైక్ కనబడలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగదాంబ ఆలయంలో..



నిజామాబాద్ రూరల్: మండలంలోని గొల్లగొట్టతండాలోగల సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి అమ్మవారి ముక్కుపుడుక, పుస్తెలు ఎత్తుకువెళ్లారని రూరల్ ఎస్సై–2 ఆనంద్ సాగర్ తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నమ్మకంగా ఉంటూనే దోచేశారు

ఖలీల్‌వాడీ: నగరంలోని ఓ వైద్యురాలి వద్ద ఇద్దరు వ్యక్తులు కొన్ని నెలలుగా పనులు చేస్తూ, నమ్మకంగా ఉంటూ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. ఖలీల్‌వాడిలోని భాగ్య అనే వైద్యురాలి వద్ద రాజు, పవన్ అనే ఇద్దరు వ్యక్తులు కొన్ని నెలలుగా పనిచేస్తుండేవారు. నమ్మకంగా ఉండటంతో వైద్యురాలు వారికి ఇంటి తాళాలను ఇచ్చింది. ఈక్రమంలో ఇద్దరు కలిసి ఆరు నెలలుగా విడతల వారీగా 35 తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలిసిన వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీచర్‌పై పోక్సో కేసు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు రమేష్‌పై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా విద్యార్థిని తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు అసభ్యకర మెసేజీలు పంపాడు. దీంతో విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేకను గావుపట్టిన వారిపై కేసు..

బాల్కొండ: మండల కేంద్రంలో ఈ నెల 12న మల్లన్న ఆలయ ఉత్సవాల్లో మేక పిల్లను గావుపట్టిన వారిపై బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. జంతు సంరక్షణ సమితికి చెందిన గౌతమ్, శ్రీవిద్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

విషాదాన్ని మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- స్తంభాన్ని ఢీకొన్న బైక్.. ఇద్దరి మృతి



సోహెల్ (ఫైల్)



సుమేర్ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భీంగల్ సీఐ, మోర్తాడ్ ఎస్సై

మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బైక్‌పై వెళ్లిన ఇద్దరు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. తిమ్మాపూర్‌కు చెందిన సోహెల్(26) బతుకుదెరువు కోసం బహ్రెయిన్ వెళ్లి, రెండు రోజుల క్రితం సొంతూరుకు వచ్చాడు. అతడిని, కుటుంబ సభ్యులను కలవడంకోసం సమీప బంధువు జగిత్యాల జిల్లా యూసుఫ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ సుమేర్(21) తన బైక్‌పై తిమ్మాపూర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం సోహెల్, సుమేర్ ఇద్దరు కలిసి బైక్‌పై పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రమ్ ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు.

భార్య, కూతురును చూడకుండానే..

సోహెల్ భార్య ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోగల తన తల్లి వద్ద ఉంటోంది. నాలుగు రోజుల క్రితమే కూతురు మొదటి పుట్టిన రోజు జరిగింది. రెండు రోజుల క్రితం బహ్రెయిన్‌నుంచి వచ్చిన సోహెల్.. త్వరలోనే భార్య, కూతురును ఇంటికి తీసుకువెళ్లాలనుకున్నాడు. అంతలోనే రోడ్డు ప్రమాదం జరిగి భార్య, కూతురును చూడకుండానే సోహెల్ మృతిచెందాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఇందల్వాయి: మండల కేంద్రంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వేముల గంగాధర్(55) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్న గంగాధర్ పని ముగించుకొని హోటల్‌కి వెళుతుండగా ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించామని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో పడి రైతు మృతి



చిన్నయ్య (ఫైల్)

బాల్కొండ: కాకతీయ కాలువలోని పంపుసెట్‌లో చెత్తను తొలగించడానికి నీటిలోకి దిగిన ఓ రైతు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన రైతు కోమటి శెట్టి చిన్నయ్య(46) కాకతీయ కాలువ నీటి ఆధారంగా పంపుసెట్ ఏర్పాటు చేసుకొని, ఆ నీటితో పొలం సాగుచేసేవాడు. పంపుసెట్‌లో చెత్త పేరుకుపోవడంతో తొలగించడానికి ఆదివారం సాయంత్రం అతడు ఇంటినుంచి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం అతడి కుటుంబ సభ్యులు కాలువ వద్దకు వెళ్లారు. అక్కడ అతడి బైక్ ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు కాలువలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం చిన్నయ్య మృతదేహం లభ్యమైంది. చిన్నయ్య పంపుసెట్‌లోని చెత్తను తొలగించడానికి కాలువలోకి దిగి, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): చెట్టు పైనుంచి పడి గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన బేగరి లింగయ్య (31) ఆదివారం మేకలను మేత కోసం పంటపొలాల వైపు తీసుకువెళ్లాడు. ఈక్రమంలో అతడె పొలాల గట్టుపైన ఉన్న చింతచెట్టు ఎక్కి కొమ్మలను నరుకుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైద్రాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

కలుషిత నీరు తాగి తొమ్మిది మేకలు మృతి



మాచారెడ్డి: కలుషిత నీటిని తాగి తొమ్మిది మేకలు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని లచ్చాపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుల్లె దేవయ్యకు చెందిన మేకలు గ్రామ శివారులోని రైస్‌మిల్లు సమీపంలో మేస్తుండగా, రైస్‌మిల్లు నుంచి వెలువడిన కలుషిత నీటిని తాగాయి. దీంతో మేకలు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. ఈమేరకు పశువైద్యాధికారితో పోస్టుమార్టం చేయించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. చనిపోయిన మేకల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తలమడ్లలో ఒకరు..



సాయికుమార్ (ఫైల్)

రాజంపేట: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తలమడ్ల గ్రామానికి చెందిన కోదండమ్ సాయికుమార్(18) తూప్రాన్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఇటీవల తలమడ్ల గ్రామానికి వచ్చిన సాయికుమార్ శనివారం అకస్మాత్తుగా గడ్డిమందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని అశ్విని హాస్పిటల్‌కు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదని విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

కోళ్లకు వైరస్.. సజీవంగా పూడ్చివేత



బాన్సువాడ రూరల్ (బాన్సువాడ): బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన దామరంచ సాయిలు అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో 6వేల బ్రాయిలర్ కోళ్లను సజీవంగానే పూడ్చిపెట్టారు. గత మూడు రోజులుగా కోళ్లు అస్వస్థతకు గురికావడంతో కోళ్ల కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా వారు వైద్య పరీక్షలు జరిపి, కోళ్లకు వైరస్ సోకిందని నిర్ధారించారు. దీంతో వారి సూచనల మేరకు కోళ్లను సజీవంగా పూడ్చి వేశారు. కోళ్లకు వైరస్ సోకడంతో తాను తీవ్రంగా నష్టపోయినట్లు, సుమారు లక్షల నష్టం వాటిల్లిందని పౌల్ట్రీ రైతు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నాడు.

తప్పిపోయిన వ్యక్తి.. వెతికి, పట్టుకున్న రైల్వేపోలీసులు



ఖలీల్‌వాడీ: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన షేక్‌బాబా అనే వ్యక్తిని, పట్టుకొని అతడి బంధువులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. నాందేడ్‌లోని శివాజీనగర్‌కు చెందిన షేక్ బాబా(58) ఈనెల 14న తన చిన్న కూతురు ఉంటున్న కరీంనగర్‌కు వెళ్లినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి నాందేడ్‌కు వెళుతున్న క్రమంలో నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడ నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. దీనిపై అతడి కూతురు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా షేక్‌బాబా ముత్‌ఖేడ్ రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడే ఉండిపోయినట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి పట్టుకొని బంధువులకు అప్పగించారు.